సాక్షి జగిత్యాల

ఆదివారం । 25 । జూన్ । 2023

ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల పిల్లలు



కూతురును కొత్తపల్లి హైస్కూల్‌లో దింపుతున్న సదానందం

• మెరుగైన బోధన.. కార్పొరేట్ సౌకర్యాలు

• ఆదర్శంగా నిలుస్తున్న ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయులు

సండే స్పెషల్

చిన్నచూపు వద్దని..

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ రేకుర్తిలో నివసిస్తున్న కొడికాల సదానందం దుర్శేడ్ ప్రభుత్వ పాఠశాలలో తెలుగు పండితుడు. కూతురు కొడికాల చతురను ప్రభుత్వపాఠశాలలో చదివించాలని భావించారు. కొత్తపల్లి జెడ్పీపాఠశాలలో ఏడో తరగతిలో ప్రవేశం పొందిన చతుర ప్రస్తుతం 9వ తరగతి చదువుతోంది. దివ్యాంగుడైన సదానందం నిత్యం చతురను పాఠశాలలో దింపి ఉద్యోగానికి వెళ్తారు. సాయంత్రం ఇంటికి తీసుకెళ్తారు. ప్రభుత్వ పాఠశాలలపై చిన్నచూపు తొలగాలని తన కూతురిని ఇక్కడ చదివిస్తున్నట్లు సదానందం వెల్లడించారు.

సర్కారీ బడికే జై కొడుతున్నారు ప్రభుత్వ టీచర్లు. ఇంగ్లిష్ మీడియంలో బోధన.. కార్పొరేట్‌కు దీటైన వసతులు ఆకర్షితులను చేస్తున్నాయి. ప్రైవేట్‌కు పంపే స్థోమత ఉన్నా.. ప్రభుత్వ టీచర్లు తమ పిల్లలను సర్కార్ బడిలో చేర్పిస్తున్నారు. ప్రభుత్వ బడిలో కల్పిస్తున్న సౌకర్యాలు.. విద్యాబోధన గురించి తమ పిల్లల ద్వారానే వివరిస్తూ మిగతా వారిని ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వం 'మన ఊరు – మన బడి', 'మన బస్తీ – మన పాఠశాల' పేరుతో సౌకర్యాలు మెరుగుపరచడం.. యూనిఫాం.. పుస్తకాలు.. నోట్‌బుక్స్.. రుచికర మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తుండడం ప్రైవేట్ నుంచి ప్రభుత్వ బడికి మళ్లేలా చేస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చదవిస్తున్న ఆదర్శ ఉపాధ్యాయులపై ఈ వారం సండే స్పెషల్..

సర్కారుబడి తక్కువేం కాదు



కొడుకు అభిజ్ఞతో భారతి

కోరుట్ల: మండలంలోని ధర్మారం ప్రాథమికోన్నత పాఠశాల టీచర్లు రాజు, భారతి పిల్లలను తాము పని చేసే బడిలోనే చదివిస్తున్నారు. రాజు పెద్ద కొడుకు సిద్ధసాయి 5వతరగతి, చిన్న కొడుకు విశ్వ 1వ తరగతి, భారతి కొడుకు అభిజ్ఞ 4వ తరగతి చదువుతున్నారు. పిల్లలను సర్కారు బడిలోనే చదివించడంలో నామోషీలేదని, పోటీపడి డీఎస్సీలో ప్రతిభ చూపామని, తమపై తమకు నమ్మకం ఉందని చెబుతున్నారు. తాము చదువు చెప్పే బడిలోనే తమ పిల్లలను చదివిస్తే ఊర్లోని తల్లిదండ్రుల్లో నమ్మకం పెరుగుతుందని వివరించారు. సర్కార్ బడిలోనే తమ పిల్లలను చదివిస్తే భవిష్యత్ బాగుంటుందని పేర్కొన్నారు.



తిమ్మాపూర్ పాఠశాలలో కూతుర్ని దింపుతున్న శ్రీలత

దీటైన చదువులు

చందుర్తి: మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన కాపిల్ల శ్రీలత– నరేశ్ దంపతులు ప్రభుత్వ టీచర్లు. నరేశ్ కోనరావుపేట మండలం పల్లిమక్తలో, శ్రీలత ఆశిరెడ్డిపల్లెలో పనిచేస్తున్నారు. తిమ్మాపూర్‌లోనే నివాసముంటూ కూతురు సహస్రాన్వితను స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదివిస్తున్నారు. చందుర్తికి చెందిన బండ శంకర్ రామన్నపేటలో ఉపాధ్యాయుడు. కూతురు బండ సింధు చందుర్తి జెడ్పీ పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. కొడుకు ఆశీష్ చందుర్తి ప్రాథమిక పాఠశాలలో ఐదోతరగతి చదువుతున్నాడు.

ప్రైవేటు నుంచి ప్రభుత్వ పాఠశాలకు..



ఎల్లారెడ్డిపేట:మండలంలోని దుమాలలో పనిచేస్తున్న మంతుర్తి రామచంద్రం కూతురు సహజను ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఐదోతరగతి వరకు చదివించారు. ప్రభుత్వ పాఠశాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన అందుతుందనే సంకేతాన్ని తెలియజేయడానికి ఎల్లారెడ్డిపేటలోని జెడ్పీ పాఠశాలలో ఆరోతరగతిలో చేర్పించాడు. ఎలగందుల దేవరాజు అనే ప్రధానోపాధ్యాయుడు సైతం తన ఇద్దరు పిల్లలను తాను పనిచేసే పాఠశాలలో చదివించగా.. ఇటీవలి పదోతరగతి ఫలితాల్లో 9.8 జీపీఏ సాధించారు.

ప్రభుత్వ చదువులే బెస్ట్



తమ పిల్లలతో నవీన్‌కుమార్- స్వర్ణలత

జగిత్యాల: జిల్లాలోని మల్లాపూర్ మండలం సాతారం గ్రామానికి చెందిన జక్కుల నవీన్‌కుమార్– స్వర్ణలత దంపతులు ఎస్జీటీలు. ప్రస్తుతం కోరుట్లలో నివాసముంటున్నారు. స్వర్ణలత కోరుట్ల మండలం ధర్మారం ఎంపీయూపీఎస్‌లో, నవీన్‌కుమార్ మల్లాపూర్ మండలం వేంపల్లిలో పనిచేస్తున్నారు. వీరికి నిత్యశ్రీ, అన్విక ఇద్దరు కుమార్తెలున్నారు. స్వర్ణలత పనిచేస్తున్న స్కూల్‌లోనే నిత్యశ్రీ నాల్గో తరగతి, అన్విక ఫస్ట్‌క్లాస్ చదువుతున్నారు. పాఠశాలల్లోనే క్వాలిటీ చదువు ఉందని, ఇంగ్లిష్ మీడియం అందుతోందని, అందుకే తమ పిల్లలను ఇక్కడే చదివిస్తున్నట్లు వివరించారు.

తనతో పాటే ఇద్దరు పిల్లలు..

కాల్వశ్రీరాంపూర్: మడిపెల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేసే ఎస్జీటీ ఎనగంటి కవిత తన వృత్తికే ఆదర్శంగా నిలుస్తోంది. భర్త చిలువేరు సదాశివ మండలంలోని చందపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడు. కవిత ఏడేళ్ల క్రితం కథలాపూర్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. వచ్చిన కొత్తలో పాఠశాలలో 21మంది పిల్లలే ఉండడంతో సంఖ్య పెంచేందుకు తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. సౌకర్యాలను వివరించారు. సర్పంచ్, పాలకవర్గ సభ్యుల పిల్లలను బడిలో చేర్పించేలా కృషిచేశారు. కవిత సైతం తన పిల్లలు మహ (5వ తరగతి), మను (1వ తరగతి)ని తాను పనిచేసే పాఠశాలలోనే చదివిస్తున్నరు. తనతో పాటు స్కూటీపై తీసుకొచ్చి, తీసుకెళ్తోంది. ఇప్పుడు పాఠశాలలో 40 మంది వరకు పిల్లలు చదువుతున్నారు.



తన పిల్లలతో పాఠశాలకు వస్తున్న ఎనగంటి కవిత



తన ఇద్దరు పిల్లలు శ్రావ్య, శ్రావణితో శ్రీనివాస్

తండ్రీకూతుళ్లు.. సర్కారు బడికే..

గోదావరిఖనిటౌన్: రామగుండం పరిధిలోని జనగామ జిల్లాపరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడు టి.శ్రీనివాస్ తన ఇద్దరు కూతుళ్ల శ్రావ్య, శ్రావణిని ఆదే పాఠశాలలో 8వ తరగతి చదివిస్తున్నారు. మంథని ముత్తారం గ్రామానికి చెందిన శ్రీనివాస్ సైతం ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదివారు. తన కూతుళ్లను సైతం తాను బోధించే పాఠశాలలోనే చదివిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు బాగుంటాయని, అందుకే తన పిల్లలనూ ఇక్కడే చదివిస్తున్నట్లు వివరించాడు.

తండ్రితో కొడుకు

వేములవాడరూరల్: మండలంలోని హన్మాజిపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు హరికృష్ణ తన ఇద్దరు పిల్లలను అదే పాఠశాలలో చదివిస్తున్నారు. సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న హన్మాజిపేటకు చెందిన తీగల నాగరాజు, వట్టిమల్ల పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న హన్మాజిపేటకు చెందిన నందిని దంపతుల పిల్లలు ప్రణవి, విశ్వక్‌వర్ధన్‌ను స్థానిక ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తున్నారు.



హన్మాజిపేటలో తన కొడుకును పాఠశాలకు తీసుకెళ్తున్న టీచర్

తల్లి వెంట తనయ



తరగతి గదిలో తల్లిజయతో కూతురు తేజశ్రీ

రామగుండం: రామగుండం మండల పరిషత్ పాఠశాలలో మ్యాథమెటిక్స్/తెలుగు బోధించే ఆడెపు జయ తన కూతురు తేజశ్రీని ఇదే స్కూల్‌లో చదివిస్తున్నారు. భర్త సత్యనారాయణ సింగరేణి ఉద్యోగి. జయకు ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురును సైతం ప్రభుత్వ పాఠశాలలోనే చదివించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఇంటర్ చదువుతోంది. చిన్న కూతురు తేజశ్రీకి రెండోతరగతిలో ప్రవేశం కల్పించగా ప్రస్తుతం ఐదోతరగతి చదువుతోంది. తాను సైతం చిన్నప్పటి నుంచి ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే విద్యాభ్యాసం చేశానని, ప్రభుత్వ పాఠశాలలోనే ఉద్యోగం చేస్తున్నానని, పిలలనూ ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదివించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు జయ వివరించారు.

తాను చదివిన స్కూల్‌లోనే



పాఠశాలలో కొడుకు విద్యావర్ధన్‌చారితో దేవేంద్రాచారి దంపతులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం చీకోడుకు చెందిన వోజు దేవేంద్రాచారి కొండాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడు. దేవేంద్రాచారి, శశికళ దంపతులకు అక్షరప్రియ, విద్యావర్ధన్‌చారి పిల్లలు. వీరిద్దరిని చీకోడు ప్రాథమిక పాఠశాలలోనే నర్సరీలోనే చేర్పించారు. అక్షర ప్రియ ఐదో తరగతి, విద్యావర్ధన్‌చారి మూడో తరగతి చదువుతున్నారు. తానూ చీకోడు ప్రభుత్వ పాఠశాలలోనే చదివి ఉపాధ్యాయుడిగా ఎదిగానని, అదే పాఠశాలలో పిల్లలిద్దరిని చేర్పించానని దేవేంద్రచారి పేర్కొన్నారు.



స్కూటీపై కొడుకును స్కూలుకు తీసుకొచ్చిన టీచర్ శారద

ఆదర్శ దంపతులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ పోతనకాలనీకి చెందిన అనిల్‌– శారద ప్రభుత్వ టీచర్లు. అనిల్ హరిపురం ముత్తారంలో, శారద రామగుండం మండలం నరసింహపురం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నారు. శారద పనిచేసే పాఠశాలలోనే పెద్దకొడుకు శ్రీహన్‌ను ఒకటోతరగతిలో చేర్పించారు. ప్రస్తుతం మూడోతరగతి చదువుతున్నాడు. రెండోకొడుకునూ త్వరలోనే ప్రభుత్వపాఠశాలకు పంపిస్తామని అనిల్‌- శారద దంపతులు తెలిపారు.



పిల్లలను పాఠశాలకు తీసుకెళ్తున్న రాజనర్సయ్య

నలుగురు పిల్లలు సర్కారు బడికే..

మెట్‌పల్లి: పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన పొట్ట రాజనర్సయ్య –స్వాతి దంపతులకు నలుగురు పిల్లలు. ముగ్గురు కొడుకులు రాజేంద్ర, రాజలింగం, రాజన్, కూతురు రాజలక్ష్మి రాజనర్సయ్య పట్టణ పరిధిలోని ప్రియదర్శిని కాలనీ ప్రాథమికపాఠశాలలో ఉపాధ్యాయుడు. తన పిల్లలను మొదటి నుంచీ స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిస్తున్నాడు. ప్రస్తుతం పెద్దకొడుకు ప్రభుత్వ కళాశాల నుంచి ఇంటర్ పూర్తి చేశాడు. రెండో కొడుకు అదే కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మూడో కొడుకు, కూతురు చావిడి వద్ద ప్రభుత్వ పాఠశాలల్లో తొమ్మిది, ఆరోతరగతి చదువుతున్నారు. తనకు చదువు చెప్పిన గురువుల పిల్లలూ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించారని, వారిని స్ఫూర్తిగా తీసుకున్నట్లు రాజనర్సయ్య వివరించారు.

ఉద్యోగం చేసేచోటే..



పిల్లలను పాఠశాలకు తీసుకొస్తున్న వెంకటేశ్వర్లు

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధి కొత్తపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కరంకొండ వెంకటేశ్వర్లు పదేళ్లుగా ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఇతని పిల్లలు రాకేశ్ 8వ తరగతి, కూతురు జీవణి 7వ తరగతి మొదటి నుంచి కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలోనే చదువుతున్నారు. నిత్యం తనతో పాటు స్కూల్‌కు తీసుకొచ్చి.. తనతో పాటే సాయంత్రం ఇంటికి తీసుకెళ్తాడు వెంకటేశ్వర్లు.



కొత్తగట్టు పాఠశాలలో కొడుకుతో శ్రీనివాస్

చిన్నప్పటి నుంచే..

శంకరపట్నం: హుజూరాబాద్‌లో నివాసం ఉండే బోడ శ్రీనివాస్ ఎస్జీటీ. ప్రస్తుతం మండలంలోని రాజాపూర్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. మండలంలోని మెట్‌పల్లిలో పనిచేసినప్పుడే తన కొడుకు సుశాంత్‌ను తను విధులు నిర్వహించే పాఠశాలలోనే ఒకటో తరగతిలో చేర్పించారు. తనతోపాటు బైక్‌పై కొడుకును తీసుకొచ్చేవారు. డిప్యూటేషన్‌పై కొత్తగట్టుపాఠశాలకు వెళ్లడంతో సుశాంత్‌ను సైతం కొత్తగట్టులో చేర్పించారు. ఇప్పుడు బదిలీపై రాజాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు వెళ్లడంతో 9వ తరగతి చదివే సుశాంత్‌ను నిత్యం కొత్తగట్టు పాఠశాలలో దింపి విధులకు వెళ్తున్నారు.

'ప్రైవేట్' విత్తనాలే దిక్కు!

• సొంతంగా తయారు చేసుకోలేకపోతున్న అన్నదాతలు

• ఇదే అదనుగా అధిక ధరలు వసూలు చేస్తున్న సీడ్ కంపెనీలు



జగిత్యాల పట్టణ శివారులోని ఓ పొలంలో ప్రైవేట్ సీడ్ వరినారు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లావ్యాప్తంగా ఈ వానాకాలంలో దాదాపు 3 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. అయితే, సొంతంగా విత్తనాలు తయారు చేసుకోవాల్సిన రైతులు.. ప్రైవేట్ కంపెనీలపై ఆధారపడుతున్నారు. వీరి బలహీనతలను ఆసరాగా చేసుకున్న కొన్ని కంపెనీలు.. అధిక ధరలతో అందినకాడికి వసూలు చేస్తున్నాయి.

సీడ్ కంపెనీలదే హవా..

రైతులు పండించిన వడ్లను బహిరంగ మార్కెట్ కన్నా క్వింటాలుకు రూ.100 – రూ.200 వరకు అధిక ధర చెల్లించి సీడ్ కంపెనీలు కొనుగోలు చేస్తున్నాయి. ఆ తర్వాత దుమ్ముధూళి, తప్ప, తాలు తొలగిస్తున్నాయి. వీటినే నాణ్యమైన విత్తనాలుగా చెబుతూ మళ్లీ రైతులకే అధిక ధరలకు విక్రయిస్తున్నాయి. రైతుల నుంచి క్వింటాలుకు రూ.2,000 వరకు వెచ్చించి వడ్లు కొనుగోలు చేసిన విత్తన కంపెనీలు.. ప్రాసెస్ చేసి 25 కిలోల బస్తాను రూ.750 నుంచి రూ.800వరకు ధరతో మళ్లీ వారికే విక్రయిస్తున్నాయి.

జిల్లాకు 3 లక్షల బస్తాల విత్తనాలు..

- మన జిల్లాలో సుమారు 3 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారని అధికారులు అంచనా వేయగా, ఒక్కో ఎకరాకి బస్తాలోని 25కేజీల విత్తనాలు వినియోగిస్తారు.
- అంటే, జిల్లాలో 3 లక్షల బస్తాల విత్తనాలు వినియోగిస్తారు.
- ఒక బస్తా ధర ప్రస్తుతం రూ.750 వరకు ఉండగా, జిల్లా రైతులు విత్తనాలపైనే రూ 22.50 కోట్ల వరకు ఖర్చు చేస్తారని అధికారులు అంచనా వేశారు.
- అయితే, కొన్ని కంపెనీలు కక్రవిత్తనం(హైబ్రిడ్) అంటూ నాలుగైదు కిలోల సంచికే రూ.1,500 వరకు వసూలు చేస్తున్నాయి.

గతంలో రైతులే తయారు చేసుకునేవారు..

- గతంలో రైతులే సొంతంగా వరి విత్తనాలు తయారు చేసుకునేవారు.
- మూడేళ్లకోసారి పరిశోధన స్థానాల నుంచి లేదంటే ప్రైవేట్ సీడ్ కంపెనీల నుంచి తీసుకొచ్చుకునేవారు.
- తర్వాత, ఆ పంటలో కల్తీ, బెరుకులు లేకుండా చూసుకునేవారు.
- ఆ తర్వాత, విత్తన పంట కోసి, సడెం కొట్టి విత్తనాలు ఎండబెట్టేవారు.
- ఇలా, వచ్చే విత్తనాలను మరోరెండు, మూడు పంటలకు ఉపయోగించేవారు.
- తద్వారా అన్నదాతలకు విత్తన ఖర్చు బాగా తక్కువగా ఉండేది.
- తమ గ్రామంలో అత్యధికంగా వరి బాగా పండించే రైతు నుంచి మిగతా వారు విత్తనాలు తీసుకెళ్లేవారు.
- దీంతో ఆ ఊరికి అవసరమైన విత్తనాలు అక్కడివే సరిపోయేవి.
- ఇప్పుడు నాణ్యమైన విత్తన వడ్లు పండిస్తున్న రైతులు ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయిస్తున్నారు.

నేనే తయారు చేసుకుంట



ఏటా ఆరేడు ఎకరాల్లో వరి పంట పండిస్త. వ్యవసాయ పరిశోధన స్థానాల నుంచి బ్రీడర్ సీడ్ తీసుకొచ్చి మూడు, నాలుగు పంటలకు ఉపయోగిస్త. విత్తనాలపై పెట్టే ఖర్చును ఇలా సాధ్యమైనంత వరకు తగ్గించుకుంటున్న. మిగతా రైతులు కూడా ఇలా చేసుకోవచ్చు.

– వెల్మ మాధవరెడ్డి, రైతు, లక్ష్మీపూర్

కంపెనీలపైనే ఆధారం

జిల్లాలో వరి సాగు ఎక్కువ. కానీ, రైతులు ఎవరికి వారు, లేదంటే సంఘాల వారీగా విత్తనాలు తయారు చేసుకోవడం మానేశారు. ప్రైవేట్ సీడ్ కంపెనీలపై ఆధారపడుతున్నారు. కొందరే సొంతంగా తయారు చేసుకుంటున్నారు. సొంత విత్తనాలతో అధిక దిగుబడి వస్తుంది.

– సురేశ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

న్యూస్‌రీల్

నృసింహుని సన్నిధిలో భక్తుల రద్దీ



ప్రధాన ఆలయంలో బారులు తీరిన భక్తులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తొలుత సమీపంలోని గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

నిర్వాసితులతో ఆర్డీవో సమావేశం



మాట్లాడుతున్న ఆర్డీవో వినోద్‌కుమార్

కథలాపూర్(వేములవాడ): సిరికొండ– తక్కళ్లపెల్లి వాగుపై వంతెన నిర్మాణంలో భూములు కోల్పోయే రైతులతో కోరుట్ల ఆర్డీవో వినోద్‌కుమార్ శనివారం సమావేశమయ్యారు. పనుల్లో కోల్పోయే భూమి ఎంత, ప్రభుత్వం తరఫున మంజూరయ్యే పరిహారం వివరాలను రైతులకు వివరించారు. రైతుల నుంచి అభ్యంతరాలను అడిగి తెలుసుకున్నారు. కాగా సిరికొండలో ట్రాక్టర్లు ఇష్టమొచ్చినట్లు మట్టిని తరలించడంతో తమ ఇళ్లకు నష్టం జరుగుతోందని అల్లె రాందాస్ అనే వ్యక్తి ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌శ్రీనివాస్, ఆర్ఐ సోహేల్, సర్పంచ్ గాండ్ల వీణ, రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ భాస్కర్ సూచించారు. శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో గడిచిన వారం రోజుల్లో 23 సైబర్ నేరాలపై ఫిర్యాదులు అందాయన్నారు. బాధితులు రూ.9,96,827 కోల్పోయారని తెలిపారు. మోసపోయిన వెంటనే బాధితులు స్పందించి టోల్ ఫ్రీనంబర్లు 1930, డయల్ 100కు ఫోన్‌కాల్ చేయడంతో రూ.81,088 ఫ్రీజ్ చేశామని అన్నారు.

ఈ జాగ్రత్తలు తీసుకోండి

లాటరీ తగిలిందని, లోన్ మంజూరైందని ఫోన్‌కాల్స్, వాట్సాప్ మెసేజ్‌లు వస్తే ఆశపడొద్దని ఎస్పీ సూచించారు. ఇలాంటి కాల్స్ వస్తే 1930 నంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అపరిచితుల నుంచి వచ్చే వీడియో కాల్స్ లిఫ్ట్ చెయవద్దన్నారు. ఇతరత్రా ఎలాంటి ప్రలోభాలకు గురిచేసినా స్పందించరాదని చెప్పారు.

వారం రోజుల్లో నమోదైన కేసులు

యూపీఐ	12
ఇంటర్నెట్ బ్యాంకింగ్	4
డెబిట్, క్రెడిట్‌కార్డులు	3
ఈ వ్యాలెట్	2
ఫ్రాడ్‌కాల్స్	1
ప్రొఫైల్ హ్యాకింగ్	1

గడువులోగా మహాసభలు

జగిత్యాలరూరల్: నిర్దేశిత గడువులోగా మహిళా సంఘాలు మహాసభలు పూర్తిచేయాలని సెర్ప్ అదనపు ప్రాజెక్ట్ అధికారి సుధీర్ సూచించారు. సెర్ప్ కార్యాలయంలో జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల అన్నపూర్ణ, అక్షర మండల సమాఖ్యల సమావేశాలు శనివారం జరిగాయి. ఆయన మాట్లాడుతూ, గత ఆర్థిక సంవత్సరం గ్రామైక్య సంఘాల ఆడిట్ పూర్తయిందన్నారు. వెంకటేశ్, గంగాధర్, విద్యాసాగర్, గంగారాం, రవీందర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

'మంత్రి కొప్పుల రీకౌంటింగ్‌కు ఒప్పుకోవాలి'



మాట్లాడుతున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

జగిత్యాల టౌన్ : గత ఎన్నికల్లో రీకౌంటింగ్ ఆపాలని కోర్టుకు ఎందుకు వెళ్లారో చెప్పాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంత్రి ఈశ్వర్‌ను ప్రశ్నించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కౌంటింగ్ ప్రక్రియలో తనకు అన్యాయం జరిగిందని, రీకౌంటింగ్ జరపాలని తాను కోర్టును ఆశ్రయిస్తే మంత్రి కొప్పుల ఈశ్వర్ రీకౌంటింగ్ ఆపాలని కోర్టుకు ఎందుకు వెళ్లారో చెప్పాలన్నారు. తన కేసును కోర్టులు స్వీకరించగా, రీకౌంటింగ్‌ను వ్యతిరేకిస్తూ మంత్రి ఈశ్వర్ వేసిన కేసులను కోర్టులు డిస్మిస్ చేయడమే తప్పు జరిగిందనడానికి నిదర్శనమన్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో ఎన్నో అవతవకలకు పాల్పడి కొప్పుల గెలిచారని ఆరోపించారు. తనకు న్యాయవ్యవస్థపై నమ్మకం ఉందని స్ట్రాంగ్ రూంల్లో ఉన్న డాక్యుమెంట్లు, సీసీటీవీ ఫుటేజీని ఎవరు మాయం చేశారో త్వరలోనే తేలిపోతుందన్నారు. మరో ఆరునెలల్లో అసెంబ్లీ గడువు ముగుస్తుందన్నారు. నియోజకవర్గ ప్రజలకు వాస్తవాలు తెలియాలనే న్యాయ పోరాటం చేస్తున్నానని లక్ష్మణ్‌కుమార్ స్పష్టం చేశారు. ఆయన వెంట నాయకులు తాండ్ర సురేందర్, శైలేందర్‌రెడ్డి, ఆవుల శ్రీనివాస్, రాములుగౌడ్, సుభాష్ తదితరులున్నారు.

వైభవంగా రథోత్సవం

సారంగాపూర్: మండలంలోని రేచపల్లి గ్రామ శివారులోని జగన్నాథ స్వామి రథోత్సవం శనివారం వైభవోపేతంగా జరిగింది. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. రథాన్ని అందంగా అలంకరించి, ప్రత్యేక పూజల అనంతరం అమ్మవార్లు, స్వామివారిని రథంలో ఆసీనులను చేశారు. భక్తుల జయ జయధ్వానాల మధ్య రథాన్ని లాగారు. జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్ రెడ్డి, సర్పంచ్ ఎడమల జయ, ఉపసర్పంచ్ రాచకొండ రాజేశం, ఎంపీటీసీ భూక్య లావణ్య రాథోడ్, మాజీ సర్పంచ్ మోత్కూరి ప్రసాద్, మాజీ మండల కో ఆప్షన్ సభ్యుడు ఎండీ ఇబ్రహీం, నాయకులు బేర మహేశ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోంద్ర రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

నర్సింహులపల్లెలో పోలీసుల విచారణ

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లె గ్రామంలో మత ప్రచారకులు, గ్రామస్తుల మధ్య జరిగిన వివాదంపై శనివారం పోలీసులు విచారణ జరిపి నలుగురిపై కేసు నమోదు చేశారు. ఏఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో మత ప్రచారకులు పోలీసుల అనుమతులు లేకుండా పెద్దఎత్తున తిరుగుతూ శుక్రవారం ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. తమ మతంలో చేరాలని ప్రచారం నిర్వహించారు. దీనిని గ్రామస్తులు అడ్డుకోగా పలువురి ఫిర్యాదు మేరకు ప్రచారం నిర్వహించిన నలుగురితో పాటు, మరికొందరిపై కేసునమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

అనుమతి అక్కర్లేదా?

- యథేచ్ఛగా నిబంధనల అతిక్రమణ
- జిల్లా కేంద్రంలో లెక్కకు మించి కార్పొరేట్ స్కూళ్లు
- విద్యాశాఖ పర్యవేక్షణ లోపమే కారణమంటున్న విద్యావేత్తలు
- ప్రత్యక్ష ఆందోళనకు దిగుతున్న విద్యార్థి సంఘాల నాయకులు



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన నాయకులు

జగిత్యాల: జిల్లాకేంద్రంలో లెక్కకు మించి కార్పొరేట్ పాఠశాలలు, విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం తొలుత విద్యాశాఖ అధికారుల అనుమతికి దరఖాస్తు చేసుకుంటున్నారు. కానీ, వెంటనే అనుమతి రాకపోవడంతో కొందరు యజమానులు నిబంధనలు అతిక్రమిస్తున్నారు. ప్రధానంగా గతంలో మూసివేసిన స్కూళ్లు, కాలేజీల భవనాల్లో విద్యాసంస్థలు తెరుస్తున్నారు. అప్పటికే ఉన్నవాటి పేరుతో కాకుండా కొత్తకొత్త పేర్లతో బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తూ..

- నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ చేసిన పేరుతోనే పాఠశాల, కళాశాల నిర్వహించాలి.
- కానీ, గతేడాది ఓ కార్పొరేట్ పాఠశాలను జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేశారు.
- దానికి విద్యా శాఖ నుంచి అనుమతి లేకపోవడంతో ఇదే ప్రాంతంలో మూసివేసిన పాఠశాల పేరిట ఏర్పాటు చేశారు.
- ఇలాంటి బడుల్లో విద్యార్థులను చేర్పితే.. మెమోలు, టీసీలు అందక చాలా సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని విద్యాభిమానులు అంటున్నారు.
- వీటి జారీకి చైల్డ్ ఇన్ఫో అవసరం ఉంటుందని అంటున్నారు.
- ప్రభుత్వ అనుమతి లేని పాఠశాలల్లో చైల్డ్ ఇన్ఫో ఉండదని, తద్వారా టీసీలు, మెమోలు జారీచేసే అవకాశం ఉండదని అంటున్నారు.
- అయితే, గతేడాది ఈ బడిలో చేర్పించిన విద్యార్థులను ప్రభుత్వ అనుమతి ఉన్న పాఠశాల పేరిట వార్షిక పరీక్షలు రాయించారని ప్రచారం సాగుతోంది.

తోక పేర్లతో బురిడీ..

ఈటెక్నో, డీజీ, కాన్సెప్ట్ వంటి రకరకాల పేర్లు, అందమైన భవనాల ఫొటోలతో తల్లిదండ్రులను యజమానులు ఆకట్టుకుంటున్నారు. ప్రైవేటు పాఠశాలలు, విద్యా సంస్థలు ఏర్పాటు చేయాలంటే విద్యాశాఖ అనుమతి తప్పనిసరి. తొలుత బడి ప్రారంభించి అనుమతి తీసుకున్నాక విద్యార్థులను చేర్చుకోవాలని, ఆ తర్వాత పూర్తిస్థాయిలో అనుమతి పొందాలని నిపుణులు చెబుతున్నారు. ప్రాథమికోన్నత స్థాయి పాఠశాల ఏర్పాటుకు జిల్లా విద్యాధికారి, ఉన్నత తరగతులకు ఆర్జేడీ నుంచి అనుమతి తీసుకోవాలి. కానీ, కొన్ని పాఠశాలలు, కాలేజీల యాజమాన్యాలు ఈ నిబంధనలు పాటించడంలేదని విమర్శలు వస్తున్నాయి. కనీస సౌకర్యాలు కల్పించకుండానే తాము సీబీఎస్‌ఈ సిలబస్ ఆధారంగా విద్యాబోధన చేస్తున్నామని కొందరు యజమానులు ఏకంగా ప్రచారం చేసుకోవడం విస్మయం కలిగిస్తోంది.

నిబంధనలు పాటించాలి

ప్రతీ ప్రైవేట్ పాఠశాల నిబంధనల ప్రకారమే నడవాలి. ప్రభుత్వం నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. అనుమతి లేనివాటిపై ఫిర్యాదులు అందితే తగిన చర్యలు తీసుకుంటాం.

– జగన్మోహన్ రెడ్డి, డీఈవో

అత్యధిక ఫీజులు..

- ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు ఫీజులు అత్యధికంగా వసూలు చేస్తున్నారు.
- ఎల్‌కేజీకి సుమారు రూ.35 వేలు, పదో తరగతి వరకు రూ.60 వేలు వసూలు చేస్తున్నారని తల్లిదండ్రులు చెబుతున్నారు.
- ఫీజులే కాదు.. తమ వద్దే పుస్తకాలు, బెల్టులు, టైలు, బ్యాడ్జీలు కొనుగోలు చేయాలని నిబంధన విధిస్తున్నారు.
- విధిలేని పరిస్థితుల్లో తల్లిదండ్రులు అదే పాఠశాలల్లో అన్నీ కొనుగోలు చేస్తున్నారు.

మౌలిక వసతులు కరువు..

జిల్లా విద్యాశాఖ నిర్లక్ష్యంతోనే కొన్ని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు నిబంధనలు అతిక్రమిస్తున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. పార్కింగ్ స్థలాలు, ఫైర్‌సేఫ్టీ అనుమతులు, పారిశుధ్యం నిర్వహణ గురించి అధికారులు ఏమాత్రం ఆరా తీయడం లేదంటున్నారు.

కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

జగిత్యాల: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో డీఈవో పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ ఏబీవీపీ నాయకులు కలెక్టరేట్ ఎదుట శనివారం ఆందోళన చేశారు. నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫామ్స్ విక్రయిస్తున్నారని, అధికంగా డొనేషన్ వసూలు చేస్తున్నారని, బస్సు చార్జీల పేరిట తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నారని ధ్వజమెత్తారు. ఈ విషయాలపై డీఈవోకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పర్యవేక్షణ లోపంతో ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యసమితి సభ్యుడు సాయికుమార్, నాయకులు నల్ల నవీన్, నందు, కార్తీక్, సునీల్, రాజు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం

- బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి

కథలాపూర్ (వేములవాడ): బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అంబారిపేటలో బీజేపీ నాయకులు గడప గడపకూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో ప్రజలకు సేవచేయడం, సుపరిపాలన అందించడం బీజేపీతోనే సాధ్యమన్నారు. సీఎం కేసీఆర్ ఇంటికో ఉద్యోగమని తెలంగాణలో నిరుద్యోగులను మోసం చేశారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీ రాముల ప్రకాశ్, మల్లికార్జున్, రవితేజ, హరీశ్, సత్యం, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



అంబారిపేటలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

దొంగతనం కేసులో ఇద్దరి రిమాండ్

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ పొలం వద్ద ఉన్న ట్రాక్టర్ కేజీవీల్స్‌ను దొంగతనం చేసిన ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ ఎస్సై సుధాకర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కొత్తవాడకు చెందిన ముద్దం గంగారెడ్డికి కండ్లపల్లి శివారులో వ్యవసాయ పొలం ఉంది. అక్కడే పొలం దున్నేందుకు ట్రాక్టర్ కేజీవీల్స్ ఉంచగా జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్‌కు చెందిన ఒరుకుపూలే గణేశ్, ఎద్దిగాని శ్రీనివాస్ కొద్దిరోజుల క్రితం ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. శనివారం ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



దొంగల అరెస్ట్ చూపుతున్న రూరల్ ఎస్సై సుధాకర్

రేపటి నుంచి 'రైతుబంధు' సాయం

- జిల్లాలో 2,36,269 మందికి అందనున్న పెట్టుబడి సాయం
- నేరుగా రైతుల ఖాతాల్లో జమ



పెగడపల్లి: జిల్లాలో వానాకాలానికి సంబంధించి రైతుబంధు సాయాన్ని సోమవారం (ఈనెల 26) నుంచి ప్రభుత్వం రైతుఖాతాల్లో జమ చేయనుంది. గత యాసంగి సీజన్‌లో భూముల క్రయ విక్రయాలు, యాజమాన్య హక్కుల బదిలీల్లో మార్పులు, వారసత్వ పట్టాల మార్పిడి ఆధారంగా రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి అవకాశం కల్పించినా, ప్రత్యేక పోర్టల్ తెరుచుకోకపోవడంతో జిల్లాలో చాలామంది రైతులకు రైతుబంధు సాయం అందలేదు. కాగా సీసీఎల్‌ఏ నుంచి జిల్లాల వారీగా అందిన సమాచారం ఆధారంగా ఈనెల 26 నుంచి రైతుల ఖాతాల్లో నగదు జమచేసేందుకు అధికారులు కసరత్తు పూర్తిచేశారు. యాసంగిలో 2,12,063 మందికి రైతుబంధు సాయం అందగా ప్రస్తుతం కొత్తగా పట్టాలు పొందిన వారితో కలిపి జిల్లా వ్యాప్తంగా 2,36,269 మంది రైతులకు పెట్టుబడి సాయం అందనుంది.

రైతు ఖాతాల్లో జమ

రైతుబంధు సొమ్ము నేరుగా రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. ఈనెల 26 నుంచి దశలవారీగా రైతు జాబితా ప్రకారం ఖాతాల్లోకి నగదును బదిలీ చేస్తాం. కొత్తగా పట్టాదారు పుస్తకాలు వచ్చిన వారితో పాటు ఇప్పటివరకు రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోని రైతులు ఈనెల 27 వరకు ఏఈవోల వద్ద దరఖాస్తు చేసుకోవచ్చు.

– పాక సురేశ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి

ఘనంగా జగన్నాథ రథయాత్ర



రథయాత్రలో పాల్గొన్న జెడ్పీ చైర్ పర్సన్ దంపతులు

జగిత్యాలటౌన్ : ఇస్కాన్ మెట్‌పల్లి ఆలయ కేంద్రం, జగిత్యాల ఇస్కాన్ ప్రచార కేంద్రం ఆధ్వర్యంలో శ్రీ జగన్నాథ రథయాత్రను ఘనంగా నిర్వహించారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన రథయాత్రలో జెడ్పీ చైర్ పర్సన్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై రథాన్ని లాగారు. జగిత్యాల పట్టణంలోని శుభమస్తు ఫంక్షన్‌హాల్ నుంచి ప్రారంభమైన యాత్ర కొత్తబస్టాండ్, టవర్‌సర్కిల్, మోచీబజార్ మీదుగా సాగింది. ఈ సందర్భంగా జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత మాట్లాడుతూ... స్వామివారి ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషంగా ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. హరినామ సంకీర్తనలతో సాగిన రథయాత్రకు పట్టణ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ ఆవారి శివకేసరి బాబు, ఇస్కాన్ ప్రచార కేంద్ర ప్రతినిధులు జరుపుల శ్రీనివాస్, నరహరి దాస్, తదితరులున్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య



గంగ నర్సయ్య (ఫైల్)

కోరుట్ల రూరల్: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన గుజ్జె గంగ నర్సయ్య (43) గతంలో పలుసార్లు గల్ఫ్ వెళ్లి వచ్చాడు. ఏడాదిన్నర క్రితం ఇక్కడే ఉంటూ ఉన్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తున్నాడు. అప్పులు తీర్చేమార్గం లేకపోవడంతో కొంతభూమిని విక్రయించాడు. అయినా అప్పులు తీరకపోవడంతో శనివారం తన పొలం వద్ద చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, భార్య అంజమ్మ ఉన్నారు. భార్య అంజమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఒంటరితనం భరించలేక..



సాయిలు మృతదేహం

పట్టణ శివారులోని అల్లమయ్య గుట్ట ప్రాంతంలో నూనె సాయిలు(45) శనివారం సాయంత్రం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. కోరుట్ల పట్టణానికి చెందిన నూనె సాయిలు కూలీ పనిచేస్తూ తాగుడుకు బానిసకావడంతో భార్య గంగజల నిజామాబాద్ జిల్లా నందిపేటలో ఉంటూ కూలీ పని చేసుకుంటుంది. దీంతో ఒంటరితనం భరించలేని సాయిలు శనివారం సాయంత్రం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతుడికి భార్య గంగజల, కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడు గల్ఫ్‌లో ఉండగా, కూతురు వివాహం జరిగింది.

కాపర్ వైర్ల చోరీ



ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్, మాదాపూర్, మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గ్రామ శివారులోని వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కాపర్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. విద్యుత్ సరఫరాను నిలిపివేసి, ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్లను ఎత్తుకెళ్తున్నట్లు రైతులు తెలుపుతున్నారు. మండలంలో వారం రోజులుగా వరుసగా ట్రాన్స్‌ఫార్మర్ల కాపర్ వైర్ చోరీ జరుగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌కో అధికారులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి కేసు నమోదు చేశారు.

6 నుంచి పంచాయతీ కార్మికుల సమ్మె

జగిత్యాలటౌన్: తమ డిమాండ్ల సాధనలో భాగంగా గ్రామ పంచాయతీ కార్మికులు జూలై 6వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో తొలుత సమ్మె నోటీసు అందజేశారు. నాయకులు మాట్లాడుతూ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలనే ప్రధాన డిమాండ్‌తోపాటు మరో 16డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పంచాయతీరాజ్ కమిషనర్‌కు అందజేశామన్నారు. సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నుంచి స్పందన లేనందున సమ్మెలోకి వెళ్లక తప్పని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మిక సంఘం నాయకులు ఎండీ ఉస్మాన్, ముదుగం రాజలింగం, ఎండీ ముక్రం, కార్మికులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

చెరువు పూడ్చివేతపై నిరసన

జగిత్యాలరూరల్: మోతె ఊరచెరువు ఎగువన ఉన్న వీక్లీబజార్ సమీపంలో కొందరు మట్టి పోస్తూ చెరువు పూడ్చివేస్తున్నారని ఆరోపిస్తూ ఆ గ్రామానికి చెందిన గంగపుత్రులు శనివారం ఆందోళన చేపట్టారు. చెరువును పూడ్చివేతతో తాము ఉపాధి కోల్పోతామని ఆవేదన చెందారు. రియల్టర్లు చెరువును పూడ్చివేస్తూ ప్లాట్లు పెట్టి దందా కొనసాగిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న మున్సిపల్ కమిషనర్ నరేశ్, ఆర్ఐ హరీశ్‌రావు, ఇన్‌చార్జి చైర్మన్ గోలి శ్రీనివాస్ అక్కడకు చేరుకుని గంగపుత్రులతో మాట్లాడారు. అయితే, చిన్ననీటి పారుదల శాఖ అధికారులతో మాట్లాడి చెరువు హద్దులను ఏర్పాటు చేయాలని గంగపుత్రులు కోరారు.



మాట్లాడుతున్న మున్సిపల్ అధికారులు

ధాన్యం కొనుగోళ్లలో 'గొల్లపల్లి' టాప్

- జిల్లాలో అత్యధికంగా 1.48 లక్షల క్వింటాళ్లు వడ్లు సేకరించిన 'సింగిల్‌విండో'
- ద్వితీయస్థానంలో పెగడపల్లి, తృతీయ స్థానంలో వల్లంపల్లి సహకార సంఘం



గొల్లపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం

కథలాపూర్(వేములవాడ): యాసంగి ధాన్యం కొనుగోళ్లతో గొల్లపల్లి సహకార సంఘం జిల్లాలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఈ సింగిల్‌విండో అత్యధికంగా 1.48 లక్షల క్వింటాళ్ల వడ్లు కొనుగోలు చేసింది.

51 సహకార సంఘాలు..
270 కొనుగోలు కేంద్రాలు..

- జిల్లాలో 51 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉండగా, వీటి పరిధిలో మొన్నటి యాసంగిలో 270 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- సుమారు రెండు నెలలపాటు వడ్లు కొనుగోలు చేశారు.
- ధాన్యం తూకం వేయించి, వాహనాల్లో రైస్‌మిల్లులకు తరలించడంలో అధికారులు, సిబ్బంది నిర్విరామంగా శ్రమించారు.
- ఈక్రమంలో జిల్లాలోని కొనుగోలు కేంద్రాల ద్వారా 29.55 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు.
- తద్వారా సుమారు రూ.600 కోట్ల వ్యాపారం చేశామని వివరించారు.

'గొల్లపల్లి' టాప్..

జిల్లాలోని గొల్లపల్లి సహకార సంఘం 1.48 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసి అగ్రస్థానం దక్కించుకుంది. పెగడపల్లి సహకార సంఘం 1.47 లక్షల క్వింటాళ్లు కొనుగోలు చేసి ద్వితీయ స్థానం, మేడిపెల్లి మండలం వల్లంపల్లి సహకార సంఘం 1.39 లక్షల క్వింటాళ్ల వడ్లు సేకరించి తృతీయ స్థానం, కథలాపూర్ మండలం భూషణరావుపేట సహకార సంఘం 1.33 లక్షల క్వింటాళ్లు కొనుగోలు చేసి నాలుగోస్థానంలో నిలిచింది.

అందరి సహకారంతోనే..



ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోళ్లలో ప్రజాప్రతినిధులు, రైతులు, అధికారులు సహకరించారు. దీంతోనే 270 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 29.55 లక్షల క్వింటాళ్ల ధాన్యం విజయవంతంగా కొనుగోలు చేశాం.

– రామానుజాచారి, జిల్లా సహకార అధికారి

నాలుగేళ్లుగా అగ్రస్థానం



రైతులకు ఇబ్బంది తలెత్తకుండా ప్రణాళిక ప్రకారం ధాన్యం సేకరించాం. తూకం వేసి సకాలంలో రైస్‌మిల్లులకు తరలించాం. మంత్రి కొప్పుల ఈశ్వర్ సహకారంతో కేంద్రాలు సక్రమంగా నిర్వహించాం. నాలుగేళ్లుగా గొల్లపల్లి అగ్రస్థానంలో నిలవడం సంతోషంగా ఉంది.

– రాజ సుమన్‌రావు, సహకార సంఘాల చైర్మన్ల ఫోరం జిల్లా అధ్యక్షుడు, గొల్లపల్లి